క్లుప్తంగా

మోడల్ గృహ నిర్మాణ పనుల పరిశీలన



మాట్లాడుతున్న మట్టా దయానంద్

కల్లూరురూరల్: నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనుండగా మండలానికో మోడల్ ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. ఇందులో భాగంగా కల్లూరు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఇటీవల నిర్మాణానికి శంకుస్థాపన చేయగా కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిర్మాణం, ఇతర అంశాలపై స్థానిక నాయకులకు అవగాహన కల్పించారు. ఇళ్ల మంజూరు, నిర్మాణం, నిధుల విడుదలపై ప్రజలకు వివరించాలని సూచించారు. నాయకులు భాగం ప్రభాకర్, ఆళ్లకుంట నర్సింహారావు, జంగా పిచ్చిరెడ్డి, యాసా శ్రీకాంత్, మట్టా రామకృష్ణ, ఎనుముల రాము, భూక్యా ప్రసాద్ పాల్గొన్నారు.

జీపీలను మున్సిపాలిటీలో విలీనం చేయాలి



ఎమ్మెల్యే రాగమయికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కల్లూరురూరల్: కిష్టయ్య బంజరు, పుల్లయ్య బంజరు గ్రామ పంచాయతీలను త్వరలో ఏర్పాటు కానున్న కల్లూరు మున్సిపాలిటీలో విలీనం చేయాలని కోరుతూ.. ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే మట్టా రాగమయికు శుక్రవారం విజ్ఞాపన పత్రం అందించారు. కల్లూరు నుంచి ఈ గ్రామ పంచాయతీలు మూడుకిలోమీటర్ల పరిధిలో ఉన్నాయని వీటిని కల్లూరు మున్సిపాలిటీలో విలీనం చేసి అభివృద్ధి చేయాలని కిష్టయ్య, పుల్లయ్య బంజరు కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసరావు, నరసింహారావు, వీరయ్య, కొండలరావు, రాములు ఎమ్మెల్యేను కోరారు.

విద్యార్థులకు దుప్పట్లు, గిఫ్ట్ ప్యాకెట్లు అందజేత



విద్యార్థులకు దుప్పట్లు, గిఫ్ట్ ప్యాకెట్లు అందిస్తున్న కార్యదర్శి మానస, గ్రేస్ సొసైటీ సభ్యులు

వైరారూరల్: మండలంలోని పాలడుగు, గొల్లెనపాడు గ్రామాల్లోని జీఎస్ఎస్ డే కేర్ సెంటర్ల లో విద్యనభ్యసిస్తున్న సుమారు 160 మంది విద్యార్థులకు శుక్రవారం గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శి మానస చేతుల మీదుగా దుప్పట్లు, గిఫ్ట్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ జాన్, సెంటర్ల ఇన్‌చార్జ్‌లు వినోద్‌కుమార్, రోజమ్మ, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


ఉచిత పశువైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

మధిర: మండలంలోని నక్కలగరుబు గ్రామంలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశు వైద్యురాలు డాక్టర్ ఉమా కుమారి మాట్లాడుతూ.. పశువులను నెలనెలా పశువుల ఆస్పత్రికి తీసుకువచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ శిబిరంలో పశువులకు గర్భనిర్ధారణ, అన్ని రకాల పరీక్షలను నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వెంకటేశ్వరరావు, కిరణ్, మురళీకృష్ణ, ఐవీ కృష్ణ, వలరాజు, సురేష్, బోసు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధురాలు మృతి



స్వరాజ్యలక్ష్మి(ఫైల్)

తల్లాడ: తల్లాడలో శుక్రవారం స్వాతంత్య్ర సమర యోధురాలు కుంచం స్వరాజ్యలక్ష్మి అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆమె మృతదేహాన్ని తల్లాడలోని పలువురు ప్రముఖులు, వ్యాపారులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

అన్నదాతల అగచాట్లు

గ్రామాల్లో గోదాములు లేక రైతులు గగ్గోలు..

- అకాల వర్షాలకు రైతుల ఇబ్బందులు
- పంటను దాచుకునే సదుపాయం లేదు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



చిరుమర్రిలో ఆరు బయట ఆరబోసిన ధాన్యం, మిర్చిపై పట్టాలు కప్పుతున్న రైతులు

ముదిగొండ: మండలంలో 50వేల ఎకరాల భూమి ఉంది. దానిలో సాగుభూమి 38వేల ఎకరాలు, మొత్తం రైతులు 18,683మంది ఉన్నారు. మండలంలోని వల్లభి, బాణాపురం, ముదిగొండ, మేడేపల్లిలలో ఐఓబీ, యూనియన్ బ్యాంకు, డీసీసీబీ, ఏపీజీవీబీ, ఎస్‌బీఐ బ్యాంకులున్నాయి. బ్యాంకుల్లో తెచ్చిన అప్పులు ప్రతి ఏటా వడ్డీలు చెల్లించి రెన్యూవల్ చేయించుకుంటున్నారు. ప్రతి ఎకరాకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించి రుణమాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఇంత వరకు పూర్తి స్థాయిలో చేయలేదని రైతులు వాపోతున్నారు. దీంతో రైతులు బ్యాంకుల చుట్టూ పత్రాలతో ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ ఏడాది పత్తి సరిగా పండక మధ్యలోనే దున్ని, మిర్చి వేశారు. మరికొందరు మొక్కజొన్న వేశారు. బావులు, చెరువులు సమీపంలో ఉన్న రైతులు వరి పంటలు వేశారు. ఇవన్నీ పెట్టుబడులను ఎదుర్కొనలేక రైతన్నలు నానా తిప్పలు పడుతున్నారు.

ఆరుగాలం కష్టించి పండించిన రైతన్నకు ప్రతి చోట అగచాట్లు తప్పడం లేదు. అప్పులు చేసి పండించిన పంటలను సరైన ధర వచ్చే వరకు నిల్వ ఉంచుకునేందుకు ఒక్క గోదాము కూడా లేకపోవడంతో ఆరు బయట, ఖాళీ స్థలాల్లో ఆరబెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. తీరా ఆరబెట్టుకున్నాక విక్రయించే సమయంలో కారు మబ్బులతో కమ్ముకున్న వర్షాలకు నీటి పాలైపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

పట్టించుకోని అధికారులు..

రైతులు పండించిన పంటలను ఆరబెట్టుకునేందుకు రాయితీపై నల్ల పట్టాలు అందించాల్సి ఉండగా అవికూడా సక్రమంగా అందజేయడం లేదు. ఐకేపీ, సహకార సొసైటీ, వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. విక్రయించిన పంటలను కాంటాల్లో జాప్యం చేసి, బిల్లులు చెల్లింపుల్లో ఆలస్యం అవుతుందని అంటున్నారు. మరో పక్క అకాల వర్షాలకు రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. క్లష్టర్ల వైజ్‌గా రైతు వేదికలున్న చోట పంటలను నిల్వ ఉంచుకునేందుకు గోదాములు నిర్మించాలని కోరుతున్నారు. గ్రామాల్లో అక్కడక్కడగా ఇళ్లల్లో గదులు కిరాయికి తీసుకుని వడ్లు, మొక్కజొన్నలు, పత్తి, ఇతర పంటలను నిల్వ చేసుకుంటున్నారు. ప్రైవేట్ గోదాముల్లో నిల్వ ఉంచేందుకు విపరీతమైన కిరాయిలు చెల్లించాల్సి వస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. రైతు వేదికల మాదిరిగా గిడ్డంగులను నిర్మించాలని, పంటలు వర్షాలకు తడవకుండా నల్ల పట్టాలను అందజేయాలని, రైతులు కోరుతున్నారు.

అప్పుల ఊబిలో రైతన్నలు..

దుక్కి దున్ని, ఎరువు వేసి, విత్తు పెట్టి, నీరు పెట్టే దాకా రైతన్న నానా తంటాలు పడి పంటలు పండిస్తూ.. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. చివరకు పంట చేతికొచ్చే నాటికి ఏదో రూపంలో నష్టాలు చవి చూడాల్సిన పరిస్థితి గత రెండు, మూడు ఏళ్ల నుంచి ఎరువులు, పురుగు మందుల ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. నష్టాలను చవి చూడలేక కొంత మంది రైతులు అపరాలు, కూరగాయల పంటలవైపు మొగ్గు చూపుతున్నారు.

గోదాములు నిర్మించాలి..



రైతుల బాధను అర్థం చేసుకుని, అకాల వర్షాలకు పండించిన పంటలను కాపాడుకునేందుకు ప్రభుత్వం నుంచి గోదాములు నిర్మించినట్లయితే, మాలాంటి రైతులకు ఎంతో మేలు జరుగుంది. ప్రైవేట్ గోదాములో నిల్వ చేయాలంటే అధిక ఖర్చుతో కూడుకున్నది. ఇకనైనా రైతుల ఇబ్బందులను గుర్తించి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గండు ఉపేందర్, రైతు, చిరుమర్రి

రైతులకు 'భరోసా' ఇవ్వాలి



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరారూరల్: సాగులో ఉన్న ప్రతీ ఎకరాకు పంట పెట్టుబడి సాయం కింద రైతు భరోసా ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం గొల్లెనపాడులో నిర్వహించిన రైతు మహాసభలో ఆయన మాట్లాడారు. సాగులో లేని భూములకు రైతుబంధు నిలుపుదల చేయవచ్చు కానీ.. సాగుచేసుకుంటున్న రైతులకు కోత విధించడం సరికాదన్నారు. 31 రోజులుగా నిరాహార దీక్షలో ఉన్న పంజాబ్ రైతు నాయకుడు జగ్జిత్‌సింగ్ దాలైవాల ప్రాణాలు కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం సంయుక్త కిసాన్ మోర్చతో చర్చలు జరిపి రైతుల డిమాండ్లను నేరవేర్చాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం బాధ్యులు శ్రీనివాసరావు, వెంకటనారాయణ, వెంకటేశ్వరరావు, రాజా, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి



ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

తల్లాడ: కేంద్రం తీసుకొచ్చిన నూతన మార్కెట్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ డిమాండ్ చేశారు. తల్లాడలో శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు వ్యతిరేఖ ప్రతులను దహనం చేసి మాట్లాడారు. నూతన మార్కెటింగ్ విధానంతో దేశంలో అనేక ప్రాంతాల్లో వారి ఉత్పత్తులను సంతల్లో అమ్ముకునే అవకాశం ఉందని, ఈ సంతల్లోకి అగ్రి బిజినెస్ ద్వారా ఆన్‌లైన్ మార్కెటింగ్ వల్ల అనేక మంది ఉపాధి కోల్పోతారని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు శీలం సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి మోహన్‌రావు, రామలింగేశ్వర్‌రావు, నాగేశ్వరరావు, వెంకటనరసయ్య, రాంబాబు, కృష్ణయ్య, కృష్ణయ్య, జగన్నాధరావు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ మరణం..
దేశానికి తీరని లోటు

పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిన మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని పలువురు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయాల్లో శుక్రవారం డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టిన మహనీయుడు మన్మోహన్ అని ఆయన సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లిటౌన్: మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి



వైరా: మన్మోహన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కల్లూరులో..



చింతకాని: గాంధీనగర్‌కాలనీలో..



కారేపల్లి: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కొణిజర్లలో..

క్యాలెండర్లు ఆవిష్కరణ



నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న టీజీఐడీసీ చైర్మన్ విజయబాబు

సత్తుపల్లి: పట్టణంలోని 4వ వార్డు కౌన్సిలర్ మట్టా ప్రసాద్, 17వ వార్డు కౌన్సిలర్ వేములపల్లి పుష్పలత, మధుల నూతన సంవత్సర క్యాలెండర్లను సత్తుపల్లిలో టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ చల్లగుండ్ల కృష్ణయ్య, వేములపల్లి మధు, కొత్తూరు కోటేశ్వరరావు, నరుకుళ్ల సత్యం, కిట్టు, కొల్లి నర్సింహారావు, రవి, కిషోర్ పాల్గొన్నారు.

పాఠశాలకు ఫర్నిచర్ వితరణ

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు శుక్రవారం దాతలు లక్ష రూపాయలు విలువచేసే ఫర్నిచర్‌ను వితరణగా అందించారు. శీలం నర్సిరెడ్డి, అరుణ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు శీలం చంద్రశేఖర్ రెడ్డి, ప్రత్యూష దంపతులు పాఠశాలలో ఏర్పాటుచేసిన డైనింగ్ హాల్ ఫర్నిచర్‌ను పాఠశాల హెచ్‌ఎం తోట నరసింహారావుకి అందజేశారు. ఈ సదర్భంగా దాతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు శేషగిరి, సాంబశివరావు, మోజేష్, ప్రకాష్ రావు, పిచ్చయ్య, ఉపాధ్యాయులు జ్ఞానేశ్వరాచారి, కోటేశ్వరావు, కిషోర్, మాధవరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



చింతకాని: ఎంపీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న జీపీ కార్మికులు

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎర్రుపాలెంలో..



కారేపల్లి: సమ్మెలో పాల్గొన్న జీపీ కార్మికులు

చింతకాని/ఎర్రుపాలెం: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (టీపీజీపీడబ్ల్యూయూ) జిల్లా అధ్యక్షుడు అమర్లపూడి అప్పారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పంచాయతీ కార్మికులు చింతకాని, ఎర్రుపాలెం మండల పరిషత్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఐదు నెలలుగా పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించకపోతే ఎలా బతకాలని పాలకులను ప్రశ్నించారు. పనికి తగ్గ వేతనాన్ని అందించాలని, ఇన్సూరెన్స్ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ధర్నాను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, పెద్దమళ్ళ శ్రీనివాసరావులు, జీపీ కార్మికులు జయ, ఫణిరాజు, కమల, శ్రీను, కొండలరావు, సుభద్ర, తేజ, సైదులు, గోపి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు ఇవ్వాలి..

కారేపల్లి: గ్రామ పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ మండల కన్వీనర్ నరేంద్ర పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు నిర్వహించిన సమ్మెలో ఆయన మాట్లాడారు. ఈ సమ్మెలో ఎస్‌కే హుస్సేన్, నాగేశ్వరరావు, కొమరయ్య, శ్రీను, మురళి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

విద్యా, వైజ్ఞానిక సభను..



మధిర: గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

మధిర/ఎర్రుపాలెం: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 6వ విద్య, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ యూటీఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలి, మధిర ప్రాంతీయ కార్యాలయం కన్వీనర్ వినోదరావు కోరారు. శుక్రవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సంఘ సమావేశంలో వారు మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించి మాట్లాడారు. అదే విధంగా ఎర్రుపాలెంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనుమోలు కోటేశ్వరరావు, నంద్రు వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ఈ నెల 28 నుంచి 30 వరకు నల్లగొండలో నిర్వహించే యూటీఎఫ్ విద్య, వైజ్ఞానిక మహాసభలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మధిర మండల అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, వీరయ్య, ఇబ్రహీం, చెన్నయ్య, లాల్ అహ్మద్, కొండలరావు, రాజు, రమేష్, సాంబయ్య, శ్రీహరి, ఆంజనేయులు, సైదారావు, సుబ్బరామ రాజు తదితరులు పాల్గొన్నారు.

అరుణోదయ స్వర్ణోత్సవ సభను..



వైరాలో అరుణోదయ సభ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మాస్‌లైన్ నాయకులు

వైరా: ఈ నెల 31న వైరాలో నిర్వహించే అరుణోదయ స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు సీవై పుల్లయ్య, కంకణాల అర్జునరావు పిలుపునిచ్చారు. శుక్రవారం వైరాలో సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. డిసెంబర్ 31 సాయంత్రం 4 గంటలకు వైరా గాంధీ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రొఫెసర్ వినయ్‌బాబు, కవి గాయకుడు యశ్‌పాల్, మాస్‌లైన్ రాష్ట్ర, జిల్లా, డివిజన్ నాయకులు పాల్గొని మాట్లాడుతారన్నారు. ఈ కార్యక్రమంలో కన్నెగంటి అశోక్, గ్రేసమ్మ, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను..



రామనర్సయ్యనగర్‌లో వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

కొణిజర్ల: ఈనెల 28న హైదరాబాద్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు అవునూరి మధు పిలుపునిచ్చారు. శుక్రవారం రామనర్సయ్యలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో పార్టీల విలీన సభ పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. 2013 తర్వాత చీలికలతో అనేక పార్టీలుగా ఏర్పడ్డ న్యూడెమోక్రసీ ఇప్పుడు అతిపెద్ద ఏకైక పార్టీగా మారబోవడం శుభ సూచకమన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, వైరా సబ్ డివిజన్ కార్యదర్శి షేక్ రంజాన్, పౌర హక్కుల సంఘం జిల్లా నాయకులు విప్లవ్‌కుమార్, కిషన్, దస్రు, బాషా, పఠాన్ ఖాసీమ్ ఖాన్, సీతయ్య, శాంతి, మాలిని, శంకర్, అరుణోదయ నాయకులు నాగేశ్వరరావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ కేరాఫ్ బోనకల్

- ప్రాచీన క్రీడకు ప్రాణం పోస్తున్న వైనం..
- క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్న కోచ్ అమిరేశి లింగయ్య
- రాష్ట్ర, జాతీయ పోటీల్లో రాణిస్తున్న విద్యార్థులు



సబ్‌జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో చాంపియన్‌షిప్ అందుకుంటున్న బోనకల్ క్రీడాకారులు(ఫైల్)



బోనకల్‌లో ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

బోనకల్: గత 30సంవత్సరాలుగా బాల్‌బ్యాడ్మింటన్ క్రీడను అభివృద్ధి పథంలో నడుపుతూ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారుచేస్తూ విజయాల బాటలో బోనకల్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు విజయాల బాటలో పయనిస్తున్నారు. సుమారు 150మంది క్రీడాకారులు పలు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి బోనకల్ పేరును ఇనుమడింపచేశారు.

క్రీడలతో పాటు చదువులోనూ..

క్రీడలతో పాటు చదువులో కూడా రాణిస్తూ.. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సైతం పొందిన ఘనత బోనకల్ క్రీడాకారులకే దక్కింది. ప్రతిరోజు క్రీడాకారులకు శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్న కోచ్ అమిరేశి లింగయ్యను పలువురు అభినందిస్తున్నారు. సీనియర్ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న బి.ఉపేందర్, బి.ఉమ, బి.గోపి లకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు వచ్చాయి. దీనిని స్ఫూర్తిగా తీసుకోని పలువురు క్రీడాకారులు బాల్‌బ్యాడ్మింటన్ శిబిరాన్ని ఉపయోగించుకుంటున్నారు. బోనకల్‌లో 2గురుకుల పాఠశాలలతో పాటు కేజీబీవీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండడంతో క్రీడాకారులు అధిక సంఖ్యలో ఉండడంతో క్రీడాపోటీల్లో పాల్గొంటున్నారు.

ఈ ఏడాది అక్టోబర్‌లో జరిగిన 43వ సబ్‌జూనియర్ పోటీల్లో బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఈ ఏడాది వరంగల్‌లో జరిగిన 70వ సీనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయస్థానం సాధించారు. కామారెడ్డిలో జరిగిన 69వ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో బాలికల జట్టు ప్రథమస్థానంలో నిలిచి చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకుంది. అదేవిధంగా సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో బోనకల్ క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైయ్యారు. ఇలా విభాగం ఏదైనా, పోటీలు ఎక్కడైనా బోనకల్ క్రీడాకారులు సత్తా చాటుతున్నారు.

అదృష్టంగా భావిస్తున్నా..



ఈ నెల 26 నుంచి 29 వరకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం అదృష్టంగా భావిస్తున్నా. గత 5 సంవత్సరాలుగా ప్రతిరోజు క్రమం తప్పకుండా శిక్షణా శిబిరంలో పాల్గొంటున్నాను. ఇప్పటి వరకు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించడంతో గుర్తింపు లభించింది.

– కె.మధులత, ఇంటర్ ఫస్టియర్, బోనకల్

సబ్ జూనియర్ పోటీల్లో సత్తాచాటాం..



వరంగల్‌లో జరిగిన సబ్‌జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి సత్తాచాటాం. టీమ్ సభ్యులందరం సమిష్టిగా ఆడి చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకోవడం ఆనందాన్ని కలిగించింది. పలు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైయ్యాను.

– పి.శ్రీహర్షిణి, బోనకల్ గురుకుల పాఠశాల విద్యార్థిని

చదువుతో పాటు క్రీడలు ముఖ్యమే..



చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమే. ప్రతిరోజు బాల్‌బ్యాడ్మింటన్ కోసం సమయం కేటాయిస్తున్నాం. కోచ్ అమిరేశి లింగయ్య క్రీడలోని మెలుకువలను చెబుతూ జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు తయారు చేస్తున్నారు. ఇప్పటివరకు రాష్ట్రస్థాయిపోటీల్లో 5 సార్లు ఆడాను. ప్రస్తుతం జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైయ్యాను.

– కె.జశ్వతి, బోనకల్ గురుకుల పాఠశాల